# జనచేతనతోనే నిజమైన ప్రజాస్వామ్యం

జయప్రకాష్ నారాయణ్

**Bhavishyat Bharatam 10-July-2006**

మన రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు రాజకీయపక్షాలు విచ్చలవిడిగా ఖర్చుపెట్టాయి. వాటి అధ్యక్షపదవులకు జరిగే ఎన్నికల్లో సభ్యుల ఓట్లు కొనడానికీ డబ్బు వెదజల్లుతున్నాయి. ఇదంతా చూస్తుంటే - మన రాజకీయాలు జనజీవనాన్ని ఎంత భ్రష్టు పట్టించాయో స్పష్టమవుతుంది. కేవలం మూడువేల ఓట్లు ఉన్న మండలపరిషత్ సభ్యత్వానికి వ్యయం చాలా చోట్ల రూ. 10 లక్షలు దాటింది. దాదాపు 40 వేల ఓట్లు ఉన్న జిల్లాపరిషత్ సభ్యత్వానికి రూ. 25 లక్షలకు పైగానే ఖర్చు పెట్టారు. ఇందులో అధిక భాగాన్ని ఓటర్లకు డబ్బు, సారాయి పంపిణీకే వెచ్చించారు.

అందని 'స్థానిక' అధికారాలు

స్థానిక సంస్థలకు పాలకులు ఇప్పటికీ అధికారాలను బదలాయించలేదు. నిజానికి అవి ఉత్సవ విగ్రహాల వంటివే. కేంద్రీకృతమైన పాలనలో వాటికి జరిగే ఎన్నికలూ పేరుకుమాత్రమే. అయినా వాటి ఎన్నికల్లో ఇంత పెద్దయెత్తున ఖర్చు పెడుతున్నారంటే- రాజకీయాలను ఎంతటి వ్యాపారంగా మార్చివేశారో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల పేరిట ఇంత తతంగం జరిగినా- స్థానిక సంస్థల ద్వారా ఆశిస్తున్న లక్ష్యం నెరవేరాలంటే, వాటికి అధికారాలను, విధులను పూర్తిగా అప్పగించాలి. దాంతోపాటు వాటిలో జవాబుదారీతనాన్ని ప్రోదిచేయడానికి తగిన ఏర్పాట్లు ఉండాలి. అప్పుడే తమ ఓటుకు, జనహితానికి మధ్యగల సంబంధం ఏమిటో పౌరులకు అవగతమవుతుంది. డబ్బుకు ఆశపడకుండా, తమ కుటుంబ మేలుకోసం ఓటును ఓ ఆయుధంగా వినియోగించుకునేలా ప్రజలు జాగృతమవుతారు.

మన వ్యవస్థలో ఎన్ని లోసుగులున్నా- గడచిన అరవై ఏళ్లుగా ఇక్కడ ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది. అణగారిన వర్గాల వారికి ఓ గుర్తింపు తేవడంలో ఓటు కొంత మేరకైనా దోహదం చేసింది. స్వేచ్ఛ, మానవ హక్కులు విస్తరించాయి. అయితే- రాజకీయాల్లో ఉన్నవారు ప్రజలను పౌరులుగా కాకుండా, కేవలం ఎన్నికల సమయంలో పనికొచ్చే ఓటు బ్యాంకులుగా చూస్తుండటం, రాజకీయాలను వ్యాపారంగా మార్చి, తాము పెట్టిన పెట్టుబడిపై పదింతల రాబడి కోసమే పదవుల కోసం అర్రులు చాస్తుండటం, అధికారాన్ని తమ వ్యక్తిగత ఆస్తిగా, దర్పానికి ప్రతీకగా భావిస్తుండడంవల్ల- మన వ్యవస్థలో ఆశించిన ఫలితాలు రావడంలేదు. పర్యవసానంగా అవినీతి సర్వత్రా వ్యాపించడంతో సామాన్యులకు స్వాతంత్ర్య ఫలాలు దక్కడంలేదు. ప్రభుత్వ సేవలు అత్యవసరమైన వర్గాలకు రాజకీయాల్లో నిజమైన పాత్ర లేకుండా పోయింది. ప్రభుత్వ సేవలు అవసరంలేని వర్గాలు బలపడుతుండగా- విద్య, ఆరోగ్యం వంటి కనీస సౌకర్యాలు అందని సామాన్యులు బీదరికం కోరల్లో చిక్కుకుని నలిగిపోతున్నారు.

వ్యాపారంగా మారిన రాజకీయాల్లో సహజంగానే అవినీతి అడ్డూ ఆపూ లేకుండా పెచ్చుపెరిగిపోయింది. పేద ప్రజల ఓటును డబ్బుతో కొనుగోలుచేసి పదవుల్లోకి వచ్చేవారు- తమ పెట్టుబడిని తిరిగి రాబట్టుకోవడానికి అక్ర మాలకు పాల్పడతారు. ఓ కుటుంబంలోని ఓట్ల కోసం వారు ఇచ్చింది వెయ్యి రూపాయలైనా- ఎన్నికైన వారు ఆ కుటుంబంపేరిట అయిదేళ్లలో ఖర్చయ్యే రెండు లక్షల యాభైవేల రూపాయల ప్రజాధనం మీద పెత్తనం చలాయి స్తారు. బదిలీలు, కాంట్రాక్టులు, పోలీసు కేసులు, భూమి కేటాయింపులు - ఇలా ఎక్కడ అవకాశముంటే అక్కడ వారు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొమ్ము చేసుకోవడం మన రాజకీయాల్లో అంతర్భాగమైంది. అవినీతి ఇలా కొన సాగుతుండటానికి కారణం అధికారం కేంద్రీకృతం కావడమే. అధికారానికి ప్రజలు ఎంత దూరంగా ఉంటే అంతగా వారిని మభ్యపెట్టడానికి అవకాశం ఉంటుంది. ఎక్కడ ఏం జరుగుతుందో, తమకు ఎంత చేటు తెస్తోందో ప్రజలకు అర్థం కాకుండా మోసం చేయవచ్చు. అం దుకే- అధికార వికేంద్రీకరణకు మన పాలకులు ఇచ్చగించరు.

సామాన్యుల జీవితాలను బాగుచేసే విద్య, ఆరోగ్యం, అభివృద్ధి వంటి రంగాలకు- అక్రమార్జనే ధ్యేయంగా మారిన ధన ప్రాబల్యం గల రాజకీయాల్లో ప్రాధాన్యం ఉండదు. ఆ రంగాల్లోను అవినీతికి అవకాశాలు లేకపోలేదు. అయితే- అది అంత లాభసాటి కాదు. అదీకాక- పేదలకు విద్య అందుబాటులోకి వచ్చి, వారిలో ప్రతిభా పాట వాలు వికసిస్తే- రాజకీయాల్లో ఉన్నవారు పెత్తందారీతనంతో వ్యవహరించడం, రాజకీయాలను వ్యాపారంగా కొన సాగించడం సాధ్యంకాదు. పేదలందరికీ ఆరోగ్య సౌకర్యాలు ఒనగూడి, ఉత్పాదకత పెరిగితే- వారిని బీదరికంలోనే ఉంచి, వారి అవసరాలతో తమ పబ్బం గడుపుకునే అవకాశాన్ని రాజకీయాల్లో ఉన్న వారు కోల్పోతారు. అందుకే- ధన ప్రాబల్య రాజకీయాల్లో సామాన్యుల ప్రయోజనాలకు ప్రాధాన్యం లభించదు. బాగా అభివృద్ధి చెందిన దేశా లలో కూడా రాజకీయాలు నిరంతరం విద్య, ఆరోగ్యం చుట్టూనే పరిభ్రమిస్తుంటాయి. నిరక్షరాస్యతతో, అనారో గ్యంతో కునారిల్లుతున్న మన సమాజంలో మాత్రం ఈ రెండు రంగాల్లో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడు తోంది. నిరుపేద దళిత కుటుంబాలు సైతం తమ పిల్లలను చదువుకోసం ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి వేల రూ పాయలను వెచ్చించవలసి వస్తోంది. తీరా చూస్తే నూటికి 90 మంది పిల్లలకు ఫీజులు కట్టినా సరైన విద్య అందక వారి శక్తిసామర్థ్యాలు అణగారిపోతున్నాయి. ప్రభుత్వ వైఫల్యం వల్ల ఆసుపత్రి ఖర్చులు లక్షలమందిని బీదరికంలోకి, అప్పుల బిలోకి నెడుతున్నాయి. ఉపాధికి అవసరమైన నైపుణ్యం కొరవడి అసంఖ్యాక యువజనులు నిరుద్యోగంతో అలమటిస్తున్నారు. విద్య, ఆరోగ్య రంగాలపై ఈ ప్రభుత్వాలు వ్యయం పెంచినా- ఆ నిధులను భవంతులకు, కాంట్రాక్టర్లకు కేటాయిస్తారు అంతేతప్ప, విద్య, ఆరోగ్య రంగాల్లో సేవల ప్రమాణాలను పెంచడంపై కానీ, సామాన్యుల జీవన స్థితిగతులను మెరుగుపరచడంపై కానీ శ్రద్ధ చూపరు.

నేర న్యాయవ్యవస్థలో రాజకీయాల జోక్యం కూడా ఇలాంటి ధన ప్రాబల్య రాజకీయాల్లో సహజం. తమ అక్రమార్జ నకు అడ్డు లేకుండా చూసుకోవడానికి, పెత్తందారీతనాన్ని నిలుపుకోవడానికి పోలీసు యంత్రాంగాన్ని నిర్వీర్యం చేయడం, నేర పరిశోధనల్లో జోక్యం చేసుకోవడం, తమ అక్రమాలను ఎదిరించే వారిని అణచివేయడం- ఈ రాజకీ యాల్లో పరిపాటి. నేరచరితులు రాజకీయాల్లో ప్రవేశిస్తుండటంతో సమాజంలో హింస, నేరాలు పెచ్చుపెరిగిపోతు

న్నాయి. ప్రజలకు రక్షణ కరవవుతోంది. ధన ప్రాబల్య రాజకీయాల బిలో ఒకసారి కూరుకుపోయిన వారు తమ మనుగడకోసం, అక్రమార్జనకోసం అలాంటి రాజకీయాలనే కొనసాగించక తప్పడం లేదు. వ్యక్తులుగా నిజాయతీప రులైన వారు కూడా అవినీతిని అడ్డుకోలేకపోతుండటానికి కారణం అదే. రాజకీయాల్లో నిజాయతీతో మనుగడ సాగించడం అసాధ్యమని చాలామంది రాజకీయ నాయకులు నిర్ధారణకు వచ్చేశారు. ఈ విషవలయంలో రాజ కీయ పక్షాలూ, రాజకీయ నాయకులు కూడా బాధితులే. ఇలాంటి ధన రాజకీయ సంస్కృతిలో కొట్టుమిట్టాడు తున్న పార్టీలు రాజకీయాలను, జనజీవనాన్ని బాగుచేయాలని సంకల్పించినా ఫలితాలను సాధించలేవు. అందుకే- ఎన్ని పార్టీలు వచ్చినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ సంక్షోభం ముదురుతోందే తప్ప సమసిపోవడం లేదు. మంచి మార్పులకోసం రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అడపాదడపా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. కానీ- ఎన్ని సంస్కరణలను తెచ్చినా మన రాజకీయ సంస్కృతిని మార్చే శక్తి వాటికి లేదు. రోజువారీ అధికార క్రీడలో మునిగిన వారికి ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడం సాధ్యం కాదు.

ఈ నేపథ్యంలో- మన జాతికి, బడుగు వర్గాల వారికి కొన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మన వ్యవస్థలో ఎన్నో లోపాలున్నా- కొన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు కొంతమేరకైనా అందడం, ఎదగాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉండటం వల్ల ఆర్థికంగా ఎనిమిది శాతం వృద్ధిరేటు సాధ్యమైంది. ఒకవైపు- మన సమాజం, ఆర్థిక వ్యవస్థలు దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంటే, మరోవైపు- అవినీతి, అక్రమాలలో కూరుకుపోయిన మన రాజకీ యాలు దేశాన్ని వెనక్కు లాగుతున్నాయి. అందువల్ల- నూతన రాజకీయ సంస్కృతికి పాదుగొల్పి వ్యవస్థను సంస్కరిస్తే- ఆర్థికాభివృద్ధికి పరిపాలన దోహదం చేస్తుంది. అందుకు భిన్నంగా ఆర్థికంగా వేగంతో పురోగమి స్తున్నా, రాజకీయాలు ఇలాగే సంక్షోభంలో ఉంటే సమాజంలో అసమానతలు పెచ్చుమీరుతాయి. హింసకు, అశాంతికి దారితీస్తుంది. వ్యవస్థే కుప్పకూలే ప్రమాదముంది.

మొత్తం మీద దేశం వేగంగా అభివృద్ధి చెందినట్లు కనిపిస్తున్నప్పటికీ- సంపద సృష్టిలో బడుగుజీవులు, సామా న్యులు పాలుపంచుకోలేకపోతున్నారు. అందువల్ల- సంపద, కొనుగోలుశక్తి కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతుం డగా- అసంఖ్యాక సామాన్యులు కనీస అవసరాలు తీరక అలమటిస్తున్నారు. కేవలం కులం, కుటుంబం కార ణంగా సరైన అవకాశాలు లభించక అనేకమంది యువజనుల ప్రతిభాపాటవాలు వెలుగు చూడటం లేదు. శక్తి, ఆసక్తి ఉన్నా ఉపాధికి అవసరమైన నైపుణ్యం కరవై యువత నిస్పృహకు లోనవుతోంది. ఇలా దగా పడుతున్న కోట్లమంది గుండెల్లో రగిలే కసి- హింసగా రూపాంతరం చెందవచ్చు. అటువంటి వారిలో ఏ కొందరు హింసకు పాల్పడినా సమాజం, వ్యవస్థ కుప్పకూలతాయి.

జనహితమే పరమావధి కావాలి

ఈ ప్రమాదాలన్నిటి నుంచి మన సమాజాన్ని పరిరక్షించుకోవడం సాధ్యమే. మన సమాజానికి, రాజ్యాంగానికి స్వతస్సిద్ధమైన బలం అపారంగా ఉంది. ఆ బలాన్ని సమాజ సంక్షేమంకోసం వినియోగించాలంటే- నూతన రాజ కీయ సంస్కృతి కావాలి. కేవలం కొత్త వ్యక్తులు అధికారం చేపడితేనో, కొత్త పార్టీలు ఏర్పడితేనో ఈ సమస్య పరి

ష్కారమైపోదు. సరికొత్త సంస్కృతితో జనజీవనం చుట్టూ పరిభ్రమించే జనరాజకీయాన్ని సృష్టించగలగాలి. నిజా నికి ఇందులో కొత్తదనమేమీ లేదు. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనూ, ఆ తరవాత స్వపరిపాలన తొలినాళ్లలోనూ మన రాజకీయం ఇలాంటి సంస్కృతికే పిరులూదింది. గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, పటేల్, ఆజాద్, ప్రకాశం, రాజాజీ, కామరాజ్ వంటి నేతలు పాదుగొల్పిన జనరాజకీయానికి పునఃప్రతిష్ఠ చేయాలి. ఇది ఓ రాష్ట్రానికో, ప్రాంతానికో పరిమితం కాదు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో, సచ్చరిత్ర, చిత్తశుద్ధి, నిజాయతీ, సమర్థత ఉన్న పౌరులు రాజకీయ ఉద్యమాలకు శ్రీకారం చుట్టి సమైక్యపోరాటం జరిపితేనే మన రాజకీయాలు జనరాజకీయా లుగా మార్పును సంతరించుకుంటాయి.

రాజకీయాలను సంస్కరించాలని, పాలనను ప్రక్షాళన చేయాలని, అవినీతిని అంతమొందించాలని అందరూ ఆశి స్తారు. అయితే రెండు ప్రశ్నలు అందరినీ వేధిస్తున్నాయి. మొదటిది- పిల్లి మెడలో గంటకట్టేదెవరు? ఆలోచనాప రులకు, చిత్తశుద్ధిగలవారికి మనదేశంలో కొదవలేదు. వారిలో చాలామంది విశ్లేషణలకు, విమర్శలకు పరిమితమై కార్యాచరణకు ఉపక్రమించడంలేదు. ఈ జడత్వం నుంచి పౌరులు బయటపడాలి. వ్యక్తిసుఖాన్ని జనహితంతో అనుసంధానించాలి. ప్రభుత్వ సేవల అవసరం ఉన్న బడుగువర్గాలను, శక్తివృథా అవుతున్న మహిళలను, మంచి భవిష్యత్తును కోరుకుంటున్న యువతను నూతన రాజకీయంలో భాగస్వాముల్ని చేయాలి. గతంలో అన్ని ప్రజా స్వామ్యాలూ ఇలాంటి సంక్షోభాలనే ఎదుర్కొన్నాయి. పౌరులు సంఘటితమై స్పందించగానే సమస్యలన్నీ పటాపం చలయ్యాయి. రెండో ప్రశ్న- దైనందిన సమస్యల్లో కూరుకుపోయి, ఎన్నికల్లో తాత్కాలిక ప్రలోభాలకు లోనవుతున్న జనసామాన్యం నుంచి స్పందన లభిస్తుందా? ప్రతి కుటుంబానికీ తమ మంచేమిటో, పిల్లల భవిష్యత్తు ఎలా బాగుపడుతుందో తెలుసు. జనరాజకీయానికి, తమ భవిష్యత్తుకు మధ్య ఉన్న సంబంధం అర్థమైననాడు కోట్లాది సామాన్య ప్రజలు వ్యవస్థలో మార్పుకోసం ఉద్యమిస్తారు. సూర్యోదయానికి ముందే చీకటి దట్టంగా ఉంటుంది. కారుచీకట్లో కాంతిపుంజాలను ప్రసరింపజేసే యోధులు అన్ని వర్గాల నుంచీ రావాలి. దూరదృష్టితో, తోటి ప్రజల పట్ల ఆర్తితో మనం ఉద్యమిస్తే ఈ చీకట్లు అనతికాలంలోనే తొలగిపోతాయి.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)